అంగన్‌వాడీలకు కుళ్లిన గుడ్లు!

- సైజులో కూడా తేడా
- కేంద్రాలకు గుడ్ల సరఫరాలో నిర్లక్ష్యం
- ఒకే చోట రెండు మూడు కేంద్రాలకు నిల్వ
- అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కరువు




కుళ్లిన కోడిగుడ్లు

విశాఖ విద్య: అంగన్‌వాడీ కేంద్రాలకు కుళ్లిన గుడ్లు సరఫరా చేస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని 90వ వార్డు బుచ్చిరాజుపాలెం-2 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఈ విషయం తేటతెల్లమైంది. కేంద్రానికి సరఫరా చేసిన వాటిలో కుళ్లిన గుడ్లను ట్రేలో మూలనపెట్టారు. అయితే బుధవారం ఆగస్టు నెలకు సంబంధించిన గుడ్లు కేంద్రంలో ఎవరూ లేకున్నా వాహనాల్లో తీసుకొచ్చి వేశారు. అంగన్‌వాడీ టీచర్ సెక్టార్ మీటింగ్ నిమిత్తం వెళ్లగా, ఆయా కేంద్రానికి రాక ముందే సదరు కాంట్రాక్టర్ ఎవరితో సంబంధం లేనట్టుగా అక్కడ గుడ్లు దించి వెళ్లిపోయారు.

ఒకే చోట రెండు కేంద్రాల స్టాక్

బుచ్చిరాజుపాలెం-2 కేంద్రానికి సంబంధించి 2,028 గుడ్లు సరఫరా చేయగా వాటితో పాటు బుచ్చిరాజుపాలెం-3 కేంద్రానికి సంబంధించిన 2,031 గుడ్లు కూడా ఇదే చోట దింపి వెళ్లారు. ఇలా రెండేసి కేంద్రాలకు చెందిన కోడిగుడ్లు ఒకే చోట వేయడంలో ఆంతర్యమేమిటో అనేది సంబంధిత అధికారులే చెప్పాల్సి ఉంది. కేంద్రంలో టీచర్, ఆయా వంటి బాధ్యులు లేకుండానే కేంద్రం పక్క ఇంటికి చెందిన మహిళకు వాటిని అప్పగించి తమ పనైపోయిందినట్లుగా చేతులు దులుపేసుకోవడం గమనార్హం.

గుడ్డు చిన్నబోతుంది

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే గుడ్లు సైజు కూడా చిన్నగా ఉంటుందని కేంద్రాల టీచర్లు చెబుతున్నారు. నిబంధనల మేరకు గుడ్లు సరఫరా చేసే సమయంలో వాటి సైజు ఎంత ఉందో తూకంవేసి చూపించాలి. కానీ గంపగుత్తంగా ట్రేలతో తీసుకొచ్చి వేస్తుండడంతో సైజుల్లో తేడా కనిపించడం వల్ల లబ్ధిదారులు వాటిని తీసుకునేటప్పుడు ప్రశ్నిస్తున్నారని.. తాము సమాధానం చెప్పలేని పరిస్థితులు ఎదురవుతున్నాయని టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరఫరా చేసిన గుడ్లు ఒక్కో సారి కుళ్లిపోతున్నా కాంట్రాక్టర్ పట్టించుకోకపోవటంతో ఆ భారం కూడా తమపైనే పడుతుందని కేంద్రాల కార్యకర్తలు అంటున్నారు.

పౌష్టికాహారం అందించేది ఇలాగేనా

మాతా-శిశు సంరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు కీలకంగా ఉంటుంది. 3 నుంచి 6 ఏళ్ల చిన్నారుల కోసం ప్రీ స్కూళ్లు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా గర్భిణులు,బాలింతలకు కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. రక్త హీనత నివారణ కోసం బలవర్ధకమైన ఆహారం ఇచ్చే క్రమంలో గుడ్లు పంపిణీ చేస్తున్నారు. కానీ కేంద్రాలకు సవ్యంగా గుడ్లు సరఫరా కాకపోవడం, పంపిణీ చేసేవాటిలో కూడా కుళ్లినవి ఉంటుండటంతో పౌష్టికాహారం ఎలా అందుతుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.



బుచ్చిరాజుపాలెం కేంద్రంలో దించిన రెండు సెంటర్ల కోడిగుడ్లు

ఎక్కడివి అక్కడే ఇవ్వాలి

అంగన్‌వాడీ కేంద్రాలకు నేరుగా వెళ్లి గుడ్లు సరఫరా చేయాలి. ఒకే చోట రెండు, మూడు కేంద్రాలకు సంబంధించిన గడ్లు వేయడానికి వీల్లేదు. దీనిపై పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకుంటాం.

– వరలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

విచారణ చేపడతాం

కేంద్రాలకు చిన్న సైజు గుడ్లు సరఫరా చేయడానికి వీల్లేదు. చిన్న సైజు వస్తే వెంటనే రిటర్న్ చేయాలని కేంద్రాల టీచర్లను ఆదేశించాం. గడ్లు బాగోలేక పోయినా తిప్పి పంపాలి.దీనిపై విచారణ చేపడతాం. సరఫరా అయిన వెంటనే కేంద్రాల్లో నిల్వ ఉంచకుండా లబ్ధిదారులకు సకాలంలో టీహెచ్ ఆర్ పంపిణీ చేయాలి.

– ఎం.వి. రమణ కుమారి, సీడీపీవో, విశాఖ అర్బన్ ప్రాజెక్టు

వరలక్ష్మి సేవలు అభినందనీయం



హెచ్‌ఎం వరలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు తదితరులు

గోపాలపట్నం: లక్ష్మీనగర్ ఈ బ్లాక్‌లో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ చేసిన వరలక్ష్మి దంపతులను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదన్నారు. అలాగే ఆమెను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు, ఎంఈవో సోమేశ్వరరావు సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం: కొత్తపాలెం సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపాలెం, నాగేంద్రకాలనీ, డీఏఆర్ నగర్, సంతోష్‌నగర్, యల్లపువానిపాలెం, చంద్రనగర్, భగత్‌సింగ్‌నగర్, పాతగోపాలపట్నం, నేతాజీవీధి, గోపాలపట్నం స్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థికి అభినందనలు



విద్యార్థి మోహన్‌గణేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గీతలహరి

మల్కాపురం: ఇటీవల జరిగిన అథ్లెటిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 2.5, 10 కేఎం పరుగు పందెంలో భాష్యం శ్రీహరిపురం బ్రాంచి పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఆర్.మోహన్‌గణేష్ మూడో స్థానంలో నిలిచాడు. దీంతో గణేష్‌కు పాఠశాల ప్రిన్సిపాల్ గీతలహరితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో పుష్పగుచ్ఛం అందించి, జ్ఞాపిక బహూకరించి అభినందించారు.

మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కోరమాండల్ అధికారులు

మల్కాపురం: శ్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 58వ వార్డులోని పలు ప్రాంతాల్లో మొక్కల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. కోరమాండల్ ఎదురుగా ఉన్న గుల్లలపాలెం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ నారాయణపాత్రుడు, పి.ఆర్.యు.వి.ఎస్.శర్మ, ట్రస్ట్ నిర్వాహకుడు కోరాడ శ్రీను, తదితరులు పాల్గొని పలువురికి మొక్కలు అందజేశారు.

విలేకరుల సంక్షేమానికి కృషి

మల్కాపురం : పారిశ్రామిక ప్రాంత విలేకరుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. పారిశ్రామిక ప్రాంత విలేకర్ల సంఘం బుధవారం ఎన్నికైంది. సంఘం గౌరవ అధ్యక్షుడిగా సుంకర చలపతిరావు, అధ్యక్షుడిగా ఎం.వి.గిరి, ఉపాధ్యక్షుడిగా గుప్తా, ప్రధాన కార్యదర్శిగా రాజు నూనెల, సహాయ కార్యదర్శిగా పైడిరాజు నూనెల, కోశాధికారిగా రాజుయాదవ్ లొడగల, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు అర్హులైన ప్రతి ఒక్క విలేకరికి ఇల్లు మంజూరుకు నిర్ణయించారన్నారు. పారిశ్రామిక ప్రాంతం పరిధిలోని విలేకర్ల సంఘం కోసం ఓ భవనం ఏర్పాటు కృషి చేస్తానన్నారు.

మంత్రి వాసంశెట్టి దృష్టికి కాలుష్య సమస్య



రాష్ట్ర కార్మిక మంత్రి సుభాష్‌కు కాలుష్య సమస్యపై వినతి అందిస్తున్న జనసేన నాయకులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు పరిశ్రమల కారణంగా కాలుష్య సమస్య ఎక్కువైందని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు 61వ వార్డు ప్రాంత జనసేన నాయకులు వినతిపత్రం అందజేశారు. పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన మంత్రిని వారు బుధవారం కలిశారు. కోరమాండల్ ఫెర్టిలైజర్స్, హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ) సంస్థల నుంచి నిత్యం కాలుష్యం వెలువడుతోందని వివరించారు. ప్రజలు చర్మ వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్య, కంటి చూపు మందగించడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ధర్మేంద్ర, గొంప శంకర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై మట్టికుప్పలు



రోడ్డుపై ఉన్న మట్టి కుప్పలు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ సెంటర్‌లోని గాంధీనగర్‌లో రహదారిపైనే మట్టికుప్పలు పోస్తున్నారు. పరిసరాల్లో భవన నిర్మాణాలు చేపట్టే వారు వ్యర్థాలను ఇలా తీసుకొచ్చి రోడ్డుపై వేస్తున్నారు. రోజుల తరబడి ఇలానే మట్టికుప్పలు ఉంటున్నాయి. ఈ కారణంగా ఆ దారిలో వాహనదారులు ప్రయాణానికి అసౌకర్యంగా ఉంది. జీవీఎంసీ అధికారులు స్పందించి మట్టి కుప్పలను తొలగించడంతో పాటు రహదారిపై ఇలా వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హెచ్‌ఆర్‌సీఐ రాష్ట్ర మహిళా విభాగం నియామకం



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆల్ఫా కృష్ణ

విశాఖ విద్య: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా(హెచ్‌ఆర్‌సీఐ) రాష్ట్ర మహిళా విభాగం(ఉమెన్ వింగ్)ను నియమించినట్టు కౌన్సిల్ జాతీయ కన్వీనర్ ఆల్ఫా కృష్ణ వెల్లడించారు. బుధవారం ఎన్‌ఏడీలోని కౌన్సిల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు వివరాలు తెలియజేశారు. మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా పి. శ్రీదేవివర్మ, ప్రధాన కార్యదర్శిగా సోలాపురపు పద్మరాణి నియామకమయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా మునగపాక సత్యవతి, కొల్లి రమణమ్మ, వివిధ విభాగాలకు కాళ్ల మణిప్రసాద్, కరక వలస సంతోష్‌లను ఎంపిక చేశారు. వీరందరికీ కౌన్సిల్ జాతీయ కన్వీనర్ ఆల్ఫా కృష్ణ నియామక పత్రాలు అందజేసి, అభినందించారు. నూతన కమిటీతో మానవ హక్కులు, మహిళా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ మహిళా సమస్యల పరిష్కారంలో హెచ్‌ఆర్‌సీఐ ముందుండి పని చేస్తుందన్నారు.

3న తుపాకీ సంస్కృతిపై సదస్సు



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

సీతంపేట: ప్రపంచ వ్యాప్తంగా హెచ్చుమీరుతున్న తుపాకీ సంస్కృతిపై ఈ నెల 3వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ సంస్థ ప్రతినిధి నరవ ప్రకాశరావు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం గాంధీ సెంటర్‌లో సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రపంచ శాంతిని కోరే మేధావులు సామాజిక కార్యకర్తలు పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో కృష్ణా యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య రామకృష్ణ, డాక్టర్ కె.వి.ఎస్.ఎన్.మూర్తి, అబ్దుల్ మునీర్, ముషాద్ పాల్గొన్నారు.

కేంద్రం నిర్లక్ష్యంతోనే రైలు ప్రమాదాలు

తాటిచెట్లపాలెం: కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగానే రైలు ప్రమాదాలు సంభవిస్తున్నాయని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. మంగళవారం తెల్లవారుజామున జరిగిన రైలు ప్రమాదంపై ఆయన స్పందించారు. 10 ఏళ్లుగా రైలు ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సరిగా స్పందించడం లేదన్నారు. సమస్యలను గుర్తించడం , పరిష్కరించడం వంటివి చేయడం లేదని, ఈ ప్రమాదాలకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని పేర్కన్నారు. రైల్వేలో భద్రతా ప్రమాణాలు సరిగా లేకపోవడం, సిబ్బంది సమస్య వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ల పేరుతో హడావుడి చేస్తున్నారే గానీ.. సాధారణ, మధ్యతరగతి రైళ్లపై, ప్రయాణికుల సౌకర్యాలపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. తరచూ జరుగుతున్న రైలు ప్రమాదాలపై పార్లమెంట్‌లో ప్రతిపక్ష, వామపక్ష, అభ్యుదయ ఎంపీలు ప్రశ్నిస్తున్నా.. దేశ వ్యాప్తంగా ప్రజలు ఉద్యమాలు నిర్వహిస్తున్నా.. స్పందించని రైల్వే మంత్రి తక్షణం రాజీనామా చేయాలని రాజు డిమాండ్ చేశారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఫోర్త్‌టౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సీతమ్మధార రాధాకృష్ణ లేఅవుట్‌లోని ధార కొండపై గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారంతో ఫోర్త్‌టౌన్ సీఐ ఎస్.విజయకుమార్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు కలిసి దాడులు చేశారు. గొల్లలపాలేనికి చెందిన వానం నవీన్, అవాల అశోక్‌కుమార్, నక్కవానిపాలేనికి చెందిన నక్కల కార్తీక్‌ల వద్ద నుంచి రెండు కిలోలు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నేడు ఉదయం స్లాట్‌లో ఓపీ సేవలు బంద్

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రిలో గురువారం ఉదయం మొదటి స్లాట్‌లో ఓపీడీ సేవలు నిలిచిపోనున్నాయి. ఆస్పత్రిలో సాధారణంగా ఉదయం రెండు స్లాట్లు, మధ్యాహ్నం రెండు స్లాట్లలో ఆన్‌లైన్‌లో జరిగే రిజిస్ట్రేషన్ ద్వారా ఓపీ డిపార్ట్‌మెంట్ సేవలు అందిస్తుంటారు. నెట్ సర్వర్‌లో సమస్య తలెత్తడంతో ఉదయం 8 నుంచి 10 వరకు ఉన్న స్లాట్‌లో ఓపీడీతో పాటు రిపీట్ మెడిసిన్ సేవలు పనిచేయబోవని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఉద్యోగులు అర్థం చేసుకుని, సహకరించాలని కోరారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై ఫిర్యాదు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తుండగా జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కాంట్రాక్ట్ కార్మికునికి వైద్యం చేయించాల్సిన కాంట్రాక్టర్ పట్టించుకోపోవడంపై ఉక్కు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి పట్టా రామ అప్పారావు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అగనంపూడి దిబ్బపాలేనికి చెందిన గొల్లవిల్లి సన్యాసిరావు విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని నవ్య రమేష్ అనే కాంట్రాక్టర్ వద్ద కాంట్రాక్ట్ కార్మికునిగా విధులు నిర్వహిస్తున్నారు. విధుల్లో ఉండగా అక్కడి సిబ్బంది కన్వేయర్‌ను ఆపరేట్ చేయడంతో అక్కడే ఉన్న సన్యాసిరావు కాళ్లు కన్వేయర్‌లో నుజ్జయ్యాయి. ఈ సమయంలో ఆదుకోవలసిన కాంట్రాక్టర్ ఈఎస్ఐ సౌకర్యం ఉందని, వాటి ద్వారా వైద్య సేవలు పొందాలని చెప్పి తప్పించుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురైందని, ఈ విషయంలో ఉన్నతాధికారులు బాధితునికి న్యాయం చేయాలని కోరారు.

నాణ్యత ఉంటేనే బిల్లుల చెల్లింపు

సాక్షి ఎఫెక్ట్..

విశాఖ విద్య: అన్న క్యాంటీన్ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాతే బిల్లులు చెల్లిస్తామని జీవీఎంసీ జోన్-8 ఈఈ రత్నాకర్ రెడ్డి పేర్కొన్నారు. 'అన్నా..ఇవేం పనులు' అనే శీర్షికన జులై 30న సాక్షిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. పనులపై ఆరోపణలు కూడా వస్తున్నాయని.. దీనిపై క్షుణ్ణంగా పరిశీలిస్తామన్నారు. అలాగే 90,92వ వార్డుల్లో అన్న క్యాంటీన్ కోసం ఐదేళ్ల కిందట భవనాలు నిర్మించడంతో బాగా పాడయ్యాని పేర్కొన్నారు. పాత ఏసీపీ క్లాడింగ్ తొలగించి, పూర్తిగా కొత్త క్లాడింగ్ వేస్తున్నామన్నారు. చేపడుతున్న పనలను క్వాలిటీ కంట్రోల్ విభాగం కూడా పర్యవేక్షణ చేస్తుందన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షణ చేస్తామన్నారు.

సేవా కార్యక్రమాలు సంతృప్తినిచ్చాయి



జ్యోతి వెలగించి సర్వ సభ్య సమావేశాన్ని ప్రారంభిస్తున్న శివాజీ

మహారాణిపేట: గడిచిన ఏడాదిలో సభ్యుల సహకారంతో మంచి కార్యక్రమాలు నిర్వహించడం సంతృప్తినిచ్చిందని ప్రేమ సమాజం అధ్యక్షుడు బుద్ద శివాజీ అన్నారు. బుధవారం డాబాగార్డెన్స్ ప్రేమ సమాజం ఆడిటోరియంలో సర్వసభ్య సమావేశాన్ని ఆయన జ్యోతి వెలగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రయం పొందుతున్న బాల బాలికలను ఉన్నత విద్యావంతులను చేయడమే లక్ష్యమన్నారు. శరణాలయంలో ఆశ్రయం పొందుతున్న ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా జీవించడమే కాకుండా ఆనందంగా ఉండాలన్నారు. ప్రేమ సమాజం అభివృద్ధికి సహకరిస్తున్న దాతలు, సభ్యులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యదర్శి కె.హరిమోహన్‌రావు ప్రేమ సమాజంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల నివేదిక వెల్లడించారు. కోశాధికారి ఎంవీవీకే గుప్త ఆదాయ వ్యయాలను వెల్లడించగా సభ్యులందరూ ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రేమ సమాజం ఉపాధ్యక్షులు మట్టపల్లి హనుమంతరావు, కేశప్రగడ నర్సింహారావు, సంయుక్త కార్యదర్శులు వి.మోహన్‌రావు, వి.కె.సురేష్ కుమార్, సలహాదారు డాక్టర్ పి.విశ్వేశ్వరరావు, ప్రత్యేక ఆహ్వానితులు, పూర్వ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్, కార్యవర్గ సభ్యులు, జీవిత కాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం



డ్రైనేజీ పరిశీలిస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డులో డ్రైనేజీల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా కార్యాచరణ సిద్ధం చేయాలని కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. ఇంజినీరింగ్ అధికారులతో కలసి బుధవారం వార్డు పరిధిలోని పలు కాలనీలను సందర్శించారు. సుసర్ల కాలనీ వద్ద సీసీ డ్రైన్లు పరిశీలించి,వాటిని ఆధునికీకరణ పనులు చేపట్టేలా ప్రతిపాదనలు చేయాలన్నారు. అదే విధంగా లక్ష్మీనగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పక్కన పార్కులో అసంపూర్తిగా ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పర్యటనలో ఏఈ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటి చెత్తను అప్పుడే తరలించాలి



అధికారులను ఆదేశిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్

జగదాంబ: యార్డులో చెత్తను ఏ రోజుకు ఆ రోజు కాపులుప్పాడ తరలించి యార్డును జీరో చేయాలని కమిషనర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన జీవీఎంసీ 35వ వార్డు టౌన్ కొత్తరోడ్డులో ఉన్న డంపింగ్ యార్డును, క్లోజ్ కాంపెక్ట్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జోన్-3, 4, 5 ప్రాంతాల నుంచి వచ్చిన చెత్తను వెంటనే యార్డుకు తరలించాలన్నారు. అక్కడి నుంచి కాపులుప్పాడకు పంపిచాలన్నారు. క్లోజ్ కాంపెక్ట్ వాహనాల్లో సామర్థ్యం మేర పంపించాలన్నారు. తక్కువగా పంపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే విధంగా రోడ్డుపైన డెబ్రిస్, సిల్ట్, ఇసుక ఉండకూడదన్నారు. వాటిని కూడా జీవీఎంసీ వాహనాల్లో డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. ముఖ్యంగా యార్డు నుంచి దుర్వాసన రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్తకు ప్లాస్టిక్ కవర్లు చుట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ సత్యనారాయణరాజు, మెకానికల్ ఈఈ దిలీప్, ఇంజినీరింగ్ ఈఈ సంతోష్‌కుమారి, ఏఈ జాన్సన్, ఏఎంహెచ్‌వో ఎ. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి జర్నలిస్టుల వినతి

మహారాణిపేట: విశాఖ జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులు స్థానికంగా పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి సహకరించాలని కోరుతూ పలు జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు బుధవారం కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు గతంలో మాదిరిగా 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఈ సందర్భంగా కోరారు. గత సంవత్సరం మాదిరిగానే వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌కు సంబంధించి జర్నలిస్టులు చెల్లించాల్సిన ప్రీమియం సీఎస్ఆర్ కింద చెల్లింపునకు సహకరించాలని, పెండింగ్‌లో ఉన్న ప్రెస్ అక్రిడేషన్లు జారీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ ఈ సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రాము, ఆర్.రామచంద్రరావు, ఉపాధ్యక్షుడు కె.చంద్రమోహన్, లోకల్ న్యూస్ పేపర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సత్యనారాయణ, ధవళేశ్వరపు రవికుమార్ తదితరులు ఉన్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



మృతుడు సత్య వెంకట భాస్కరరావు

అగనంపూడి: చేసిన అప్పులు తీర్చలేనన్న బాధతో ఒక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటనకు సంబంధించి దువ్వాడ సీఐ వావిలపల్లి ఎర్రంనాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజీవ్‌నగర్ గ్లోరియా స్కూల్‌కు సమీపంలో తగరం పూడి వెంకట సత్య భాస్కరరావు (50) భార్య రత్నకుమారి, ఇద్దరు పిల్లలతో నివాసముంటున్నారు. భాస్కరరావు సమీపంలోని డెయిరీ ఫామ్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ అందినచోటల్లా అప్పులు చేశాడు. సుమారు రూ.75లక్షల వరకు అప్పులు చేయడం, తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లో మానసిక ఆందోళనకు గురై కొద్దిరోజుల పాటు భీమవరం వెళ్లిపోయాడు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు భీమవరం నుంచి తిరిగి వచ్చిన భాస్కరరావు బాత్‌రూమ్‌లోకి వెళ్లి పురుగుల మందు సేవించాడు. తీవ్రమైన కడుపునొప్పి, వాంతులతో బాత్‌రూమ్ నుంచి వచ్చి అపస్మారక స్థితిలో పడిపోయిన భాస్కరరావును భార్య రత్నకుమారి చుట్టు పక్కల వారి సహాయంతో ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

రెవెన్యూ పత్రాలను భద్రపరుస్తున్నాం

గోపాలపట్నం తహసీల్దార్ రమేష్

విశాఖ విద్య: రెవెన్యూ పత్రాలను భద్రపరుస్తున్నామని గోపాలపట్నం తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్ వెల్లడించారు. 'రెవెన్యూ పత్రాల భద్రత ఇలాగేనా' అనే శీర్షికన ఆగస్టు 30న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఎన్నికల సమయంలో ఉపయోగించిన కవర్లు,ఇతర సామగ్రి రెవెన్యూ రికార్డులతో కలిపి ఉన్నందున వాటిని ప్రస్తుతం వేరు చేస్తున్నామన్నారు. ఇలా పత్రాలను వేరుచేసి గదుల్లో భద్రపరిచే క్రమంలోనే వాటిని మూటల్లో ఉంచడం జరిగిందన్నారు. కార్యాలయం మూసివేసే సమయంలో ఆ పత్రాలన్నీ భద్రంగా గదుల్లో ఉంచామని వివరణ ఇచ్చారు.

వృద్ధురాలి అదృశ్యం



పూడి గంగమ్మ

సీతమ్మధార: సీతమ్మధారలో నివసిస్తున్న పూడి గంగమ్మ అనే వృద్ధురాలు శనివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తమ బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వృద్ధురాలి ఆచూకీ తెలిసిన వారు 95733 22882 నంబర్‌కు సమాచారమివ్వాలని పోలీసులు కోరారు.